ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక: 16-12-2000

# అంకుల్!

"అంకుల్! టైమెంత?"

రాజారావు ఆమెను చూశాడు.

ఇరవై అయిదేళ్ళ అమ్మాయి నవ్వుతూ ఉంది.

"పది."

రాత్రి పది గంటలు. పెళ్ళాం, పిల్లలు విజయవాడ బస్సులో వెళ్ళారు. వాళ్ళను పంపించి వనస్థలిపురం వెళ్ళే బస్సు కోసం నిలబడ్డాడు రాజారావు.

నవంబరు నెల. చలి మొదలైంది. పొగ, కొద్దిగా ప్రారంభమైన మంచు. బస్సులు, లారీలు, ఆటోలు తిరుగుతున్నా రాజారావు ఎక్కాల్సిన బస్సు రావడం లేదు.

బస్సుస్టాపులో అంతగా జనం లేరు.

ఓ ముష్టివాడు చెత్తాచెదారం దులుపుకుని బస్‌స్టాపులో నిద్రకు ఏర్పాటు చేసుకుంటున్నాడు.

కాస్తంత అవతల రెండు గాడిదలు అచేతనంగా నిలబడి వున్నాయి.

రాజారావు గడియారం చూసుకున్నాడు. పదింబావు.

టైమడిగిన అమ్మాయి, రాజారావు దగ్గరగా వచ్చి, నవ్వి, "అంకుల్! మీతో వస్తా? ఏం?" అంది.

రాజారావుకు క్షణం అర్థం కాలేదు! ఆ అమ్మాయిని పరీక్షగా చూశాడు.

కోల ముఖం, తీర్చిదిద్దిన కనుబొమ్మలు, నుదుట బొట్టు, పక్కపాపిడి తీసిన జుత్తు, జడలో కనకాంబరాలు, మెడలో సన్నని బంగారు గొలుసు, చెవులకు ఎర్రదిద్దులు, ఉప్పొంగిన వక్షోజాలు కప్పుతూ సిల్క్ చీర. బక్క పలచగా ఉన్న అమ్మాయి, నవ్వుతూ, సిగ్గుతో ఎదురుగా నిలబడి వయ్యారంగా, 'వస్తా!' అని అంటే రాజారావు చలించాడు.

గుండెల్లోంచి యవ్వనం ఉరకలు వేసింది.

భార్యా, పిల్లలు లేరు. ఇప్పుడే రారు. మొత్తం ఇల్లంతా తనూ, ఈ అమ్మాయే! పైగా చలికాలం.

శోభనం రోజు గుర్తొచ్చింది. చాలా ఏళ్ళ తర్వాత మళ్లీ ఆనాటి మధురానుభూతులు జ్ఞాపకం వచ్చాయి.

"ఎంత?"

ఆ అమ్మాయి నవ్వింది.

"పదండి వెడదాం, అన్నీ ఇంటి దగ్గర!" అంది పమిట ఓసారి జార్చి.

ఎక్కడనుంచో ఓ ఆటోగాడొచ్చి, "వనస్థలిపురం! మనిషికి ఐదు, వస్తారా?" అనడిగాడు.

రాజారావు చేయి పట్టుకుని ఆ అమ్మాయి ఆటో ఎక్కింది.

"ఇరవై ఇస్తాం. ఇంకెవర్నీ ఎక్కించుకోకు!" - ఆ అమ్మాయే చెప్పింది.

ఆటో వెడుతున్నది.

"అంకుల్! ఏమన్నా మాట్లాడండి!" - భుజం మీద చెయ్యి వేసి, బాగా దగ్గరకు అనుకుని కూర్చుని మరీ అడిగింది.

రోడ్డు గతుకులూ, ఆటో గేర్ మార్పిడీ కుదుపులకు ఆ అమ్మాయి శరీరం తగిలినప్పుడల్లా రాజారావుకు గిలిగింతలు, పులకరింతలు కలిగి, ఊయలలూగుతున్నట్లు, కలల్లో తేలుతున్నట్లు అనిపించింది. రోమాలు నిక్కబొడుచుకున్నాయి. ఒళ్ళంతా నెత్తురు మెరుపులా ప్రవహించినట్లయింది.

"కాలనీ వచ్చాం సార్! ఎక్కడ దిగుతారు?"

రాజారావు చెప్పాడు - ఇంత త్వరగా వనస్థలిపురం వచ్చేశామా అన్న ఆశ్చర్యంతో.....

ఆ అమ్మాయే జాకెట్‌లోంచి పర్సు తీసి డబ్బు ఇచ్చింది ఆటోకు.

రాజారావు తాళం తీసి లైట్లు వేశాడు.

ఆ అమ్మాయి లోపలకు వచ్చి, తలుపు గడియపెట్టి, "అంకుల్! బెడ్‌రూమ్ ఎక్కడ?" అనడిగింది.

రాజారావు ఆ అమ్మాయి చొరవకు, తెగువకు ఆశ్చర్యపోయాడు, గది చూపించాడు.

"అంకుల్! గది శుభ్రంగా సర్దుతాను. ఈ లోపల ఫ్రెష్‌గా స్నానం చేసి రండి!" అంది.

రాజారావుకు చలి తెలియలేదు. స్నానం చేయాలనిపించింది.

"అవునూ, తినటానికి ఏమన్నా ఉందా?" - ఆ అమ్మాయి ఫ్రిజ్ తెరచి చూసి, పెదవి విరిచి డైనింగ్ టేబుల్ మీద గిన్నెలు చూస్తూ అడిగింది.

"ఏమీ లేవు."

"ఫర్వాలేదు. మీరు స్నానం చేసి రండి. నాలుగు ఆమ్లేట్లు వేస్తా. పాల పాకెట్ ఉందిగా, చాలు!"

స్నానానికెళ్తూ రాజారావు అడిగాడు - "నీ పేరు?"

ఆ అమ్మాయి నవ్వింది. "ఫర్వాలేదే..... ఇంతసేపటికి నా పేరు తెలుసుకోవాలనిపించిందే!"అని, జాకెట్టు విప్పేసి ఓ మూలకు విసిరేసి, "వసంత!" అంది. తననే తేరిపార చూస్తున్న రాజారావు దగ్గరకు వచ్చి, నవ్వి, ఓ ముద్దు ఇచ్చి, "మరీ అంత ఆశగా చూడక్కర్లేదు. రాత్రంతా జాగరణేగా! స్నానం చేసి రండి!" అంది.

రాజారావు ఆమె ఇచ్చిన ముద్దుకూ, ఆమె శరీరంలోంచి వచ్చిన వేడికీ, వాసనకూ పరవశుడైనాడు. స్నానం చేస్తూ చాలా రోజుల తర్వాత ఈల వేశాడు. అద్దంలో, నగ్నం

శరీరాన్ని నింపాదిగా చూసుకుని, యాభై దాటినా, శరీరం తుమ్మ చెక్కలా బలంగా ఉండటం తన గొప్పే అనుకున్నాడు.

రాజారావు స్నానం చేసి వచ్చేసరికి, ఆమ్లెట్ల ఘుమఘుమ, బెడ్‌రూమ్‌లో అగరొత్తుల సువాసన ముక్కుపుటాలకు తాకింది.

"అంకుల్! నేనూ స్నానం చేసి వస్తా. బుద్ధిగా జపం చేస్తూ బెడ్‌రూమ్‌లో కూర్చోండి!" వసంత బాత్‌రూమ్‌లోకి వెళ్ళింది.

ముప్పయ్యేళ్ళ వైవాహిక జీవితంలో పురుళ్ళు, రోగాలు, చదువులు, చావులు, ఆస్తి తగాదాలు, ఆఫీసులో ప్రమోషన్ కోసం, పైన సంపాదన కోసం యావ, దేబిరింపులుగా పోగా మిగిలింది వనస్థలిపురంలో ఓ ఇల్లు. ఇద్దరాడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు కాక, రోగాలతో రొష్టులతో జీవచ్ఛవం లాంటి భార్య రాజారావుకి. ఈ రోజు వసంత రావటం, తెగువతో ఇల్లంతా కలయతిరుగుతుంటే రాజారావుకి మళ్ళీ ముప్పయ్యేళ్ళ తర్వాత యవ్వనం వచ్చినట్లు, మోడువారిన పున్నాగ చెట్టు చిగురించినట్లు అనిపించింది.

వసంత తల మీద స్నానం చేసి టర్కీటవల్ చుట్టుకుని వచ్చింది. ఫాన్ కింద కూర్చుని తలారబెట్టుకుంది. టర్కీ టవల్ శరీరాన్ని పూర్తిగా కప్పకపోవడం వల్ల, వసంత తొడలు, చేతులు, సగం కనిపించే వక్షస్థలం, చామనఛాయ శరీరం మీద జారే ముత్యాల్లాంటి నీటి చుక్కలు.... రాజారావుకి ఉద్రేకాన్ని కలుగజేశాయి.

వసంత రాజారావుని క్రీగంట చూస్తూ చిరునవ్వులు చిందిస్తూ, "అంకుల్! మరి పది నిమిషాలు.... అయిపోయింది.... అవునూ, మీ అమ్మాయి నైటీగాని, మీ ఆవిడ చీరగానీ కట్టుకోవచ్చా! నా చీర, జాకెట్టు తడిపేశా!" అని, రాజారావు చూస్తుండగానే బీరువా తెరిచి ఓ నైటీ వేసేసుకుంది.

అప్పుడు వసంత.... అరేబియన్ నైట్స్‌లో మధుపాత్రతో వచ్చే సుందరాంగిలా, మదన కామరాజు కథల్లో వర్ణించే స్వప్నసుందరిలా రాజారావుకి తోచింది. మెరుపులా వెళ్ళి వసంతను వాటేసుకుని కౌగిట్లో నలిపెయ్యాలని ఆశించి, ఆకలిగొన్న పులిలా వెళ్ళాడు.

వసంత వేటగాడికి దొరకని లేడిపిల్లలా ఛెంగున దూరంగా జరిగి, "అంకుల్! మరీ అంత కక్కుర్తి వద్దు, క్షణం ఆగండి. నాకు ఆకలిగా వుంది. ఆమ్లేట్ తినేస్తా. మీరు నాకు తోడుగా కూర్చుని కబుర్లు చెప్పండి. వేడి పాలు తాగండి. తర్వాత మీ ఇష్టం. తెల్లారేదాకా మీరేం చేసినా నే కాదనను!"

రాజారావు బుద్ధిగా ఆమె చెప్పినట్లు నడుచుకున్నాడు. ఇంత వయసొచ్చీ తను వీధి కుక్కలాగా ప్రవర్తించడం బాగుండదన్న భావన, తన కూతురి వయస్సున్న పిల్ల ముందర మరీ వెధవ్వేషాలు వేయడం నామర్దా అనిపించి.

వసంత ఆమ్లేట్ తింటూ తన గురించి చెబుతూ, రాజారావుకి వేడి వేడి పాలు ఇచ్చింది. వసంత తండ్రి ఈ మధ్యనే చనిపోయాడు.

వసంత ఉద్యోగం కోసం తిరగని చోటు లేదు, ఆశ్రయించని పెద్దలూ లేరు. నలుగురు

చెల్లెళ్ళు, ఓ తమ్ముడూ  ారు. ఇల్లు అద్దెకొంప, ఆస్తి, ఇతర ఆయివేజులూ లేవు. అందుకే ఇలా వీధిన  బతుకుతెరువు కోసం.

"అంకుల్! నాకు  పాతివ్రత్యం.... ఇలాంటి మూఢనమ్మకాలు లేవు. తెలివి అమ్ముకుంటాం. ప్రావీణ్యం అమ్ముకుంటాం. పొలం, బంగారం, చదువు ఇలా అన్నీ ఫణంగా పెట్టి చాలామంది బతుకుతున్నారు. నాలాంటి ఆడది వయస్సు, అందం ఎరగా చూసి బతకటం తప్పా?" అంది వసంత.

రాజారావు ఆమె చెప్పింది విన్నాడు. వింటూనే కళ్ళు మూసుకున్నాడు.

"అంకుల్! అప్పుడే నిద్రా? పదండి, పడుకుందురుగాని."

రాజారావు వెళ్ళి పడుకున్నాడు. కలలు, రంగుల వలలు, నీలి మేఘాలు, మత్తు.... మరపురాని నిద్రలోకి ఒరిగాడు.

ఆ నిద్రలోంచి తెల్లారి పది గంటల దాకా రాజారావుకి మెలకువ రాలేదు.

అప్పటికి పనిమనిషి రెండుసార్లు తలుపు తట్టింది.

మంచం మీద ఒడ్డుకొచ్చిన సొరచేపలా రాజారావు పడి ఉన్నాడు.

"ఏంది బాబూ? అంతగా మొద్దు నిద్దర పోతున్నారు?" అని కూడా అంది.

రాజారావు ఉలిక్కిపడి లేచాడు. పరుగులా బాత్రూమ్‌లోకి వెళ్ళాడు. వసంత చీర, జాకెట్ అక్కడే వున్నాయి. వసంత మాత్రం లేదు.

ఏమైంది?!

పనిమనిషి అంట్లు తోమి, గుడ్డలు ఉతకబోతూ, "బాబూ, ఈ చీర, జాకెట్ ఎవరివి? మనింట్లో వాళ్ళవి కాదే?" అంది.

రాజారావు బీరువా తీసి చూశాడు. భార్య పట్టు చీరలు లేవు! డబ్బు లేదు!

పని మనిషి ఇల్లు ఊడుస్తూ, "బాబూ! ఇదేదో మాత్తర్ల కాగితం!" అని ఇచ్చిన స్ట్రిప్ చూశాడు.

నిద్ర మాత్రలు!

రాజారావుకి విషయం అర్థమైంది. ఆ తర్వాత కిటికీలో వసంత వ్రాసిన చీటీ చూశాడు.

"అంకుల్! ఎంతో ఆశతో వచ్చా, నిరాశ పరిచారు. అంత నిద్ర ఆపుకోలేనివారికి 'వసంత' దేనికి?"

వసంత నవ్వు, రూపం గుర్తొచ్చాయి.

"మళ్ళీ కలుద్దాం! వసంత."

రాజారావు నిస్తేజుడయ్యాడు.

భార్య, పిల్లలు గుర్తొచ్చారు. సిగ్గు పడ్డాడు. ముసలి ముప్పున మళ్ళీ 'వసంతం' రాకూడదని ఆశించాడు.

అయితే వసంత రూపం, నవ్వు, స్పర్శ, చలాకీతనం చాలా రోజులు రాజారావుకి గుర్తొస్తూనే ఉన్నాయి. •